

ఉత్తమ గురువులకు పురస్కారం



జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న పరవాడ మండలం భరణికం పంచాయతీ బాపడు పాలెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధరరావు, పాయకరావుపేట మండలం గుంటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ నాగూర్. చిత్రంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వున్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



నర్సీపట్నంలోని బలిఘట్టం ఆలయంలో బ్రహ్మలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



అనకాపల్లి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీకమాసం రెండో సోమవారం జిల్లాలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు సమీపంలోని ఆలయాలకు క్యూ కట్టారు. దీంతో అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. ఆలయాల్లో ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు.

బడ్జెట్‌లో జిల్లాకు వరాలు

అన్నదాతల సంక్షేమానికి పెద్ద పీట



బడ్జెట్ సమర్పిస్తున్న మంత్రి కేశవ్

- సుజల స్రవంతి పథకానికి రూ.63 కోట్లు
- పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి ప్రాధాన్యం
- విశాఖ-చెన్నై కారిడార్ పనులకు కదలిక
- బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో అనకాపల్లి జిల్లాకు సముచిత చోటు లభించింది. ముఖ్యంగా వ్యవసాయం, సాగునీటి పారుదల రంగాలకు పెద్ద పీట వేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. గత ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు కేటాయించారు. పారిశ్రామికాభివృద్ధి కోసం విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన నక్కపల్లి క్లస్టర్‌లో మెగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రభుత్వం మౌలిక వసతుల కల్పించనున్నది. అచ్యుతాపురంలో ఎస్ఈజడ్‌లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగుమం కానున్నది.

కూటమి ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజల నుంచి సానుకూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలు, సంక్షేమం, మరోవైపు ఆర్థిక లోటును తగ్గించేందుకు ప్రయత్నిస్తూ రూపొందించిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అన్ని రంగాలను నిర్వీర్యం చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నిర్మాణాత్మక మార్పులు తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇచ్చిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రైతు సంక్షేమమే ధ్యేయంగా...

కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనివల్ల జిల్లాలో 2.5 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. ఇంకా ఉచిత పంటల బీమా పథకం, రాయితీపై విత్తనాలు, తుంపర సేద్యం పరికరాలు, ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి ప్రోత్సాహం, ప్రకృతి సేద్యం, పశువులకు షెడ్లు (గోకులం) తదితర పథకాలకు

... మిగతా 8వ పేజీలో



కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో సుజల స్రవంతి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం (ఫైల్‌ఫొటో)



ఉత్తరాంధ్ర, సుజల స్రవంతి పథకానికి శంకుస్థాపన చేసిన చంద్రబాబునాయుడు (ఫైల్‌ఫొటో)

అన్ని వర్గాలు, రంగాలకు ప్రాధాన్యం



దాడి వీరభద్రరావు, మాజీ మంత్రి

గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అన్ని వర్గాలు, రంగాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప విషయం. సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే జిల్లా రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

ప్రజారంజక బడ్జెట్



బత్తుల తాతయ్యబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. రైతులు, పేదల అభ్యున్నతి కోసం కేటాయింపులు జరిగాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పారిశ్రామిక ప్రగతికి ప్రాధాన్యం ఇచ్చింది. ఇటు సంక్షేమ, అటు అభివృద్ధి సముచితరీతిన నిధులు కేటాయించడం హర్షణీయం.

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం



డి.పరమేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించడం సంతోషకరం. ఎన్‌డీఏ ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూనే.. మరోవైపు ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాల అభివృద్ధిపై ఫోకస్ చేస్తూ కేటాయింపులు జరపడం అభినందనీయం.

అక్కరకురాని అగ్రి ల్యాబ్

అందుబాటులోకి తీసుకురావడంలో వైసీపీ ప్రభుత్వం విఫలం

- బిల్లులు చెల్లించకపోవడంతో రెండేళ్ల క్రితం పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- సబ్బవరంలో ఉమ్మడి జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్‌కు ఆరేళ్ల క్రితం నాటి టీడీపీ ప్రభుత్వం అంకురార్పణ
- ఐదు ఎకరాల భూమి మంజూరు
- ఆక్రమణల కారణంగా కాంట్రాక్టర్‌కు అప్పగింతలో జాప్యం
- ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ
- ఏడాది తరువాత టెండర్లు, పనులు ప్రారంభం
- 2002నాటికి 90 శాతం మేర పనులు పూర్తి
- రూ.40 లక్షల బిల్లు పెండింగ్‌తో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- పరిశోధన పరికరాలను సరఫరా చేయని ప్రభుత్వం
- రెండేళ్ల నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే!
- కూటమి ప్రభుత్వంపై అన్నదాతల్లో ఆశలు



సబ్బవరం అందుబాటులోకి రాని ఉమ్మడి జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్

సబ్బవరం, నవంబరు 11 :

జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన వాటిలో అగ్రి ల్యాబ్ కూడా వుంది. దాదాపు నాలుగేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించగా, ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో పనులు మందకొడిగా సాగాయి. రెండేళ్ల క్రితం విద్యుత్, నీరు, ప్రహరీ గోడ, ఆవరణ అభివృద్ధి వంటి కొన్ని పనులు మినహా మిగిలిన వాటిని కాంట్రాక్టర్ పూర్తి చేశారు. అయితే అప్పటికే రూ.40 లక్షల బిల్లులు పెండింగ్‌లో వుండడంతో పనులు ఆపేశారు. అగ్రి ల్యాబ్ పరిస్థితిని వ్యవసాయ శాఖ అధికారులు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళతామని చెబుతున్నారు.

పంటల సాగులో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులతోపాటు భూసార పరీక్షలు ప్రధానం. వీటి పరీక్షా కేంద్రాలు గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని జేడీ కార్యాలయంలో వుండేవి. నర్సీపట్నంలో భూసార పరీక్షా కేంద్రం వుంది. అయితే వీటి పరీక్షల ఫలితాలను రైతులకు మరింత చేరువ చేయడానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక సమీకృత వ్యవసాయ ప్రయోగశాలను, జిల్లా మొత్తానికి సబ్బవరంలో ప్రయోగశాలను ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు నిర్ణయించింది. ఈ కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మట్టి నమూనాలను పరీక్షిస్తారు. నియోజకవర్గస్థాయి ల్యాబ్‌లో ఒక ఏవో, ఇద్దరు ఏఈవోలు, జిల్లాస్థాయి ల్యాబ్‌లో 12 మంది ఏవోలు, 24 మంది ఏఈవోలు వుంటారని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్‌కు అప్పటి రెవెన్యూ అధికారులు సబ్బవరంలోని సర్వే నంబరు 271లో ఐదు ఎకరాలను కేటాయించారు. అనంతరం 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రూ.3.5 కోట్లు భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలకు, రూ.2.5 కోట్లు ల్యాబ్‌కు అవసరమైన పరికరాల కోసం కేటాయించింది. అగ్రి ల్యాబ్‌ను 2019 ఖరీఫ్‌నాటికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించింది. జిల్లా స్థాయి ల్యాబ్‌లో పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలను పరీక్షించి నాణ్యతను నిర్ధారిస్తారు. అయితే అగ్రి ల్యాబ్‌కు కేటాయించిన స్థలంలో కొంతమంది ఆక్రమణదారులు వుండడంతో కాంట్రాక్టర్‌కు స్థలం అప్పగించడంలో జాప్యం జరిగింది. ఈ సమస్య పరిష్కారం అయ్యే సమయానికి ప్రభుత్వం మారిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2019 ఏప్రిల్ ఒకటో తేదీనాటికి నిర్మాణ పనులు ప్రారంభించని అన్ని అభివృద్ధి పనులను రద్దు చేసింది. ఈ జాబితాలో జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్ కూడా వుంది. ఏడాది తరువాత 2020లో భవన నిర్మాణ పనుల బాధ్యతను రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించింది. టెండర్లు పిలిచి, తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. 2021 ఖరీఫ్‌నాటికి అగ్రి ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని నాటి ప్రభుత్వం ప్రకటించింది. కానీ చేసిన పనులకు సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు మందకొడిగా సాగాయి. ఎట్టకేలకు 2022 నాటికి 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఆ సమయానికి

... మిగతా 8వ పేజీలో

సింహాద్రి ఎన్టీపీసీలో రెండో యూనిట్ షట్‌డౌన్

- వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 50 రోజులపాటు ఉత్పత్తి నిలిపివేత



పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)లో 500 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌ను అధికారులు ఆదివారం అర్ధరాత్రి షట్‌డౌన్ చేశారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం 50 రోజులపాటు ఉత్పత్తి నిలిపివేస్తారు. యూనిట్‌లోని అన్ని విభాగాల్లో నిర్వహణ, మరమ్మతు పనులు చేపడతారు. ఇందుకోసం అదనంగా కార్మికులను విధుల్లోకి తీసుకుంటారు. నిర్వహణ పనులు పూర్తయిన తరువాత విద్యుదుత్పత్తిని పునఃప్రారంభిస్తారు. కాగా ఒకటి, మూడు, నాలుగు యూనిట్‌ల్లో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతున్నదని ప్లాంట్ పీఆర్‌ఓ అఖిల్ త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన సంప్రదాయ లోగిలి.. గిరి గ్రామదర్శిని

- ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలకు ప్రతీక
- ఆదివాసీల పద్ధతిలో పెళ్లి చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత

-8వ పేజీలో



ఉక్కు ఉద్యోగులకు 35 శాతమే జీతం

- మళ్లీ కోత విధించిన యాజమాన్యం
- సెప్టెంబరులో 50 శాతం బకాయి
- అక్టోబరుకు మరో 15 శాతం తగ్గింపు
- అరకొర జీతంతో ఎలా బతకాలంటున్న ఉద్యోగులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటోంది. ఉద్యోగులకు పూర్తి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న సంగతి తెలిసిందే. సెప్టెంబరు నెలకు 50 శాతమే జీతాలు ఇచ్చింది. అక్టోబరులో దసరా, దీపావళి పండుగలు వచ్చాయని ఉద్యోగులు ఎంత మొత్తుకున్నా పట్టించుకోలేదు. తాజాగా నవంబరు వచ్చింది. అంటే అక్టోబరు జీతాలు చెల్లించాలి. సెప్టెంబరులో బకాయి 50శాతం, అక్టోబరు జీతం పూర్తిగా ఇవ్వాల్సి ఉంది. కానీ అక్టోబరు జీతం కేవలం 35శాతం మాత్రమే ఉద్యోగుల ఖాతాకు నవంబరు 11న జమచేసింది. ఇక బకాయి జీతంపై కనీసం నోరు మెదపడం లేదు.

ప్రతి నెలా ప్లాంట్ ఉద్యోగుల జీతాల చెల్లింపునకు సుమారు రూ.86 కోట్లు అవసరమవుతాయి. అన్ని రకాల మినహాయింపులు, కోతలు పోను ఉద్యోగి సగటు జాతం రూ.40 వేలు. గత నెలలో అందులో సగమే చెల్లించడంతో ఉద్యోగులు సర్దుకుపోయారు. ఈ నెలలో 35 శాతమే.. అంటే రూ.13,500 మాత్రమే వస్తుంది. ఈ మొత్తంతో కుటుంబం మొత్తం ఎలా జీవించాలని ఉద్యోగులు వాపోతున్నారు. యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే జీతాల్లో కోత విధిస్తున్నదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉక్కు పోరాట కమిటీ కన్వీనర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, యాజమాన్యం వద్ద నిధులు లేని సమయంలో జీతాలు ఇవ్వకపోయినా ఆందోళన చెందలేదని, కానీ ఇప్పుడు బ్యాంకుల్లో రూ.950 కోట్ల నిధులు వున్నాయని చెప్పారు. ఇందులో పది శాతం నిధులతో ఉద్యోగులకు పూర్తిస్థాయిలో జీతాలు ఇవ్వొచ్చన్నారు. జీతాల కోత విషయమై ఎవరితో చర్చించి అధికారులు నిర్ణయం తీసుకున్నారో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

కూటమి బడ్జెట్ భేష్

▸ రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతృప్తికరంగా ఉందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజామోదయోగ్యమైనదని ప్రశంసించారు. గత వైసీపీ ప్రభుత్వ బడ్జెట్ కొందరికి మాత్రమే లాభదాయకమైనదిగా ఉండేదన్నారు. వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాళ్ల రాజు, కర్రి వెంకటరమణ, ఈంద్ర అప్పలనాయుడు, నీరుకొండ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కొళాయిల నీటి వృథాకు అడ్డుకట్ట

▸ డీఈఈ, ఏఈఈ దగ్గరుండి ట్యాప్‌లు ఏర్పాటు

▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్టు


కొళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేస్తున్న మునిసిపల్ డీఈఈ, ఏఈఈలు

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొళాయిల ద్వారా నీటి వృథాను అరికట్టేందుకు మునిసిపల్ అధికారులు నడుంబిగించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఓ వైపు వృథా..మరో వైపు వ్యథ' శీర్షిక ప్రచురితమైన కథనానికి మునిసిపల్ డీఈఈ మాధవరావు, ఏఈఈ గణపతి సుబ్బారావు సిబ్బందితో కలిసి ట్యాప్‌లను కొళాయిలకు దగ్గరుండి ఏర్పాటు చేయించారు. సోమవారం ఉదయం 22వ వార్డు వెంకటాపురం, పెదపల్లి, గొల్లలపాలెం వార్డుల్లో తాగునీటి ట్యాప్‌లు లేని కొళాయిలకు అమర్చారు. అలాగే తులసీనగర్ ప్రాంతంలో కూడా చర్యలకు ఉపక్రమించారు. ట్యాప్‌ల నీటి వృథా లేకుండా స్థానికులు కూడా సహకరించాలని ఏఈఈ గణపతి సుబ్బారావు కోరారు. వ్యక్తిగత కొళాయిలకు కొందరు మోటార్లు ఏర్పాటు చేసుకుని నీటి చోరీకి పాల్పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

మాదకద్రవ్యాలపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనకు కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎలమంచిలి సీఐ ధనుంజయరావు సూచించారు. సోమవారం కొక్కిరాపల్లి డా.బీఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సన్మార్గంలో పయనిస్తూ ఉపాధ్యాయుల సూచనలు, సలహాలతో ముందుకు సాగాలన్నారు. మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, టీచర్లు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు నేడు చివరి రోజు

కోటవురట్ల, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించేందుకు మంగళవారం ఆఖరి రోజని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఏమైనా అభ్యంతరాలు వస్తే మంగళవారం సాయంత్రం వరకు తీసుకోవాలన్నారు. ఈనెల 13వ తేదీన ఫైనల్ ఓటర్లు జాబితాను పబ్లిష్ చేయడం జరుగుతుందన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 14,15 తేదీల్లో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నివాసం ఉంటున్నారా.. లేదా అమ్మకాలు చేశారన్న అంశంపై విచారణ చేసి నివేదికను అందజేయాలన్నారు. ఈసమావేశంలో డీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఉదయం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించనున్నామన్నారు. 15న వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు, డిబెట్, 16న పద్యపఠన పోటీలు, 17న చిత్రలేఖనం పోటీలు, 17న పుస్తక ప్రదర్శన, 18న భగవద్గీత శ్లోకాలు పఠనం, పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న జాతీయ మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీలు, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం


ఉపాధ్యాయిని విమలాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో సోమవారం నేషనల్ ఎడ్యుకేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్న విమలాదేవిని హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో టీచర్లు లలితాంబ, కుసుమకుమారి, విజయకుమారి, కరుణ, అరుణ, అప్పలనాయుడు, ప్రకాష్, సూరిబాబు పాల్గొన్నారు.

మూలజంపలో ఉపాధి గ్రామసభ

రాంబిల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో కొత్త పనులు గుర్తించేందుకు మూలజంప గ్రామంలో సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా చేపట్టే పనులు, జాబ్‌కార్డు ఉన్నవారికి పని కల్పించే విషయాలపై చర్చించారు. ఉపాధి హామీ ఏపీఓ నానిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు అందుకూరి ప్రసాద్, గ్రామ సర్పంచ్ వేగి అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ వేగి రాము, ఎన్ఆర్ఈజీఎస్ ప్రతినిధులు రామారావు, రామకృష్ణ, జేయి రాఘవేంద్ర, వీఆర్‌పీ పి.రూప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బోరుమంటున్నాయి!

▸ నెలలు తరబడి పనిచేయని చేతిబోర్లు

▸ నిర్వహణను పట్టించుకోని అధికారులు

▸ లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా

▸ చేతిబోర్ల పునరుద్ధరణలో మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం


ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోకుండా ఉన్న క్రీడా మైదానంలోని చేతిబోరు


కొత్తపేట చినరామకోవెల వీధిలో మూడు నెలలు క్రితం హెడ్ తొలగించిన బోరు

ఎలమంచిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే చేతిబోర్లు నిర్వహణ పట్ల మునిపల్ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. నీటి పథకాలు మరమ్మతులకు గురైన సమయంలో ప్రజల దాహార్తిని తీర్చే చేతి బోర్లను అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా లక్షలాది రూపాయలతో వేస్తున్న బోర్లు మూలకు చేరుతున్నాయి.

ప్రజల దాహార్తిని తీర్చడంలో ప్రధాన పాత్ర వహించే చేతిబోర్ల నిర్వహణలో మునిసిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల ఇవి తుప్పు పట్టి పాడవుతున్నాయి. మరి కొన్నిచోట్ల చోరీకి గురవుతున్నాయి. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. ఫలితంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీరడం లేదు. ఈ వారంలో తాగునీటి పథకాలు మరమ్మతు గురై మూడు రోజులు పాటు కొళాయిలు పనిచేయకపోవడంతో ప్రజలు ఎదుర్కొన్న తాగునీటి కష్టాలు అన్నీ.. ఇన్నీ కావు. ఇటువంటి సమయంలో చేతిబోర్లు సక్రమంగా పనిచేసి ఉంటే సగం మంది ప్రజలకైనా తాగునీటి ఇబ్బందులు తీరేవి. ఏటా వేసవి ప్రణాళిక పేరుతో చేపట్టే చేతిబోర్ల నిర్వహణను మునిసిపాలిటీలో అసలు చేయడం లేదు. చాలా చోట్ల చేతిబోర్లు నిరుపయోగంగా తయారయ్యాయి.

మండలంలోని 7 గ్రామాలను విలీనం చేసుకుని 25 వార్డులతో ఎలమంచి మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీలో 180 చేతిబోర్లు ఉన్నాయి. వీటిలో పట్టణంతోపాటు మంత్రిపాలెం, క్లబ్ రోడ్డు, ధర్మవరం, కొత్తపేట ప్రాంతాల్లో చేతిబోర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. మరమ్మతులకు నోచుకోని కారణంగా మునిసిపల్ ప్రజలకు మాత్రం తాగునీటి కష్టాలు తీరడం లేదు కదా రెట్టింపవుతున్నాయి. సుమారు 50 వేల పైబడి జనాభా ఉన్న మునిసిపాలిటిలో చేతిబోర్ల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ప్రధానంగా రాజీవ్‌గాంధీ క్రీడామైదానంలో వందలాది మంది క్రీడాకారులకు దాహార్తిని తీర్చే చేతిబోరు నాలుగేళ్ల క్రితం మరమ్మతుకు గురైంది. దీనిని పునరుద్ధరించడానికి మునిసిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదేవిధంగా కొత్తపేట చినరామకోవెల వద్ద వీధిలో చేతిబోరు హెడ్‌ను మరమ్మతు పేరుతో మూడు నెలల క్రితం తొలగించారు కాని నేటి వరకు బిగించలేదు. అదేవిధంగా మంత్రిపాలెం కాలనీ ప్రజలకు ప్రధాన ఆధారమైన చేతిబోరు మరమ్మతుకు గురైనా సరే పట్టించుకున్న వారే లేరని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలో ప్రజల తాగునీటి ఇబ్బందులను గుర్తించాల్సిన అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వంద కోట్ల ప్రాజెక్టు అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప కనీసం మూలకు చేరిన చేతిబోర్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రజల దాహార్తికి ఉపయోగపడే చేతిబోర్ల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పలువురు కోరుతున్నారు.


మంత్రిపాలెం వార్డులో కొళాయి నీరు పట్టుకుని బోరు వద్ద పనులు చేసుకుంటున్న స్థానికులు

శివనామ స్మరణతో హోరెత్తిన శివాలయాలు


నక్కపల్లి : ఉపమాక శివాలయంలో బారులు తీరిన భక్తులు


రాంబిల్లి: పంచదార్లలో ఉమాధర్మలింగేశ్వరునికి అర్చకుల పూజలు

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం మండలంలోని ఉపమాక, గొడిచెర్ల గ్రామాల్లో వున్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉపమాక ఆలయంలో తెల్లవారుజామున 3 గంటలకే ఆదిదేవునికి ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్ పంచామృతాభిషేకం చేసి, స్వామివారికి సప్తహారతులిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామస్థులు,దాతల సహకారంతో నాలుగు సోమవారాలు అన్నదానం చేస్తున్నట్టు దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి చెప్పారు. గొడిచెర్ల శేషలింగేశ్వరస్వామి ఆలయం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది.


పాయకరావుపేట రూరల్: సీతమ్మవారి కొండపై శివాలయానికి భక్తుల సందడి

పాయకరావుపేట రూరల్‌లో..

కార్తీకమాసం రెండో సోమవారం మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని సత్యవరం, రాజగోపాలపురం, పెంటకోట, గోపాలపట్నం సీతమ్మవారికొండ, పెద్దిపాలెం, నామవరం గ్రామాలలోని శివాలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచే చేరుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయకరావుపేట, తుని, నక్కపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వేలాది భక్తులు గోపాలపట్నం సమీపంలోని సీతమ్మవారి కొండపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని పూజించారు. భక్తులకు కోనేటి అప్పారావు కుమారులు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అదేవిధంగా పెద్దిపాలెం, పెంటకోట శివాలయాలలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

రాంబిల్లిలో..

కార్తీక రెండో సోమవారం మండలంలోని పంచదార్ల పుణ్యక్షేత్రం శివనామ స్మరణలతో మార్మోగింది. వేకువజాము నుంచి భక్తులు పంచదార్లలో పూజలు చేశారు. రాధామాదవస్వామి ఆలయం వద్ద ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఫణిగిరిపై కొలువై ఉన్న ఉమాధర్మలింగేశ్వరస్వామివారిని దర్శించి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎండోమెంట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులకు అవసరమైన వైద్యం, తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. లాలంకోడూరు, కొత్తపట్నం, వెల్చూరు, దిమిలి శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

పాయకరావుపేటలో..

కార్తీకమాసం రెండో సోమవారం పట్టణంలోని అన్ని శివాలయల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక లింగాలతోట కాలనీలో ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం, బృందావనం, రాజుగారిబీడులోని శివాలయాలతో పాటు తాండవనది అవతల ఉన్న కత్రాళ్లకొండ వద్ద ఉన్న శివాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయాల్లో దీపాలుపెట్టి తమ భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

ఎస్.రాయవరంలో..

కార్తీక రెండో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎస్.రాయవరం, గెడ్డపాలెం, పెనుగొల్లు, పెదగుమ్ములూరు, సర్వసిద్ధి, పెదఉప్పలం తదితర గ్రామాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి.


పాయకరావుపేట : కత్రాళ్ళకొండ శివాలయానికి పోటెత్తిన భక్త జనం


ఎస్.రాయవరం బుర్రేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో 'పేట' విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో ఇటీవల జన విజ్ఞాన వేదిక నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారు. సోమవారం విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈనెల 9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో 52 బృందాలు పాల్గొనగా.. వీరిలో శ్రీప్రకాశ్ విద్యార్థులు ఎస్.కిరణ్, ఎం.సాత్విక్, ఓ.సాయిశ్రావణ్ జయదీప్ బృందం చక్కని ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న సీహెచ్‌వీకే.నరసింహారావు

నిరుపయోగంగా అంగన్‌వాడీ కేంద్రం భవనం

కోటవురట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. ఏడాది నుంచి ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ అంగన్‌వాడీ కేంద్రానికి తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.10.లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణ పనులు శ్లాబ్ వరకు చేశారు. ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద రూ.5లక్షల వరకు బిల్లు అయ్యింది. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల తర్వాత మిగతా పనుల నిమిత్తం రూ. నాలుగు లక్షలు మంజూరయ్యాయి. వైసీపీ నాయకుడు పనులు పూర్తి చేసి ఏడాది కావస్తున్నా బిల్లులు కాలేదు. దీంతో భవనం నిరుపయోగంగా మారింది. ఈ విషయాన్ని మండల ఇంజనీర్ వర్మ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు రూ.4 లక్షలు మంజూరులో జాప్యం అయ్యింది. ఇటీవల బిల్లులు రూ.3.5 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



కోటవురట్లలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం

నామవరంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సిమెంటు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరం గ్రామంలో సిమెంటు రోడ్డు పనులను సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ రోడ్డును ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.9 లక్షలతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. మండలంలో రూ.199.5 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, కురందాసు శివ, గొర్ల లక్ష్మీనారాయణ, పల్లా బాబూరావు, బాబ్జి, సూరిబాబు, సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునాచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మారుతి కృష్ణ

కోటవురట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చుని నర్సీపట్నం లయన్స్ క్లబ్ ప్రెసిండెంట్ డాక్టర్ మారుతి కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్‌లోని 7,8 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. లయన్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎంఎస్ఎస్‌మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి ఏడాది చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు డాక్టర్ మారుతి కృష్ణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని డ్రాయింగ్ టీచర్ ఈశ్వర్ కిషోర్ పర్యవేక్షించారు.

ముమ్మరంగా పీఆర్‌టీయూ సభ్యత్వాల నమోదు


గొడిచెర్లలో పీఆర్‌టీయూ సభ్యత్వాలను నమోదు చేస్తున్న సంఘ ప్రతినిధులు

నక్కపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వాల నమోదు చురుగ్గా సాగుతోందని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తోడపు వెంకటరమణ, ప్రగడ శివాజీ చెప్పారు. సోమవారం మండలంలోని దేవవరం, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, డీఎల్‌పురం, నెల్లిపూడి, కాగిత గ్రామాల్లోని పాఠశాలలను సంఘ ప్రతినిధులు సందర్శించి, పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డి. నాగాచారి, కె.బాషా, సీహెచ్ ప్రసాద్, ఎస్.వెంకట రమణ, ఎల్.నాగేశ్వరరావు, కె.సంతోశ్, జి. నాగదుర్గ, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు : రాకపోకలకు ఇక్కట్లు


అరట్లకోట పొలాలకు వెళ్లే రోడ్డులో కూలిన కల్వర్టు

పాయకరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోట నుంచి పొలాలకు వెళ్లే రోడ్డులో సాగునీటి కాలువపై నిర్మించిన కల్వర్టు కూలడంతో రైతులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కూలిన కల్వర్టును తొలగించి కొత్తది నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పాయకరావుపేట వెళ్లడానికి అడ్డదారి కావడంతో విద్యార్థులు, గ్రామస్థులు ఈ రోడ్డులో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా గోతిలో పడిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి కల్వర్టు నిర్మించాలని వారు కోరుతున్నారు.

టీడీపీలో చేరిన నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు


టీడీపీలో చేరిన నునపర్తి ఎంపీటీసీ సభ్యుడిని సత్కరిస్తున్న నాయకులు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

రాంబిల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం నునపర్తికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, పలువురు ఆ పార్టీ నేతలతో సోమవారం దిమిలి గ్రామంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పప్పల, ప్రగడ టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చలపతిరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తున్నదన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొల్లి వరహాలరావు, కొల్లి వెంకటలక్ష్మి, ఎం.గంగరాజు, ఆర్‌వీవీ నగేష్, గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, కె.ప్రసాద్, కె.అప్పారావు, ఎం. అప్పలరాజు, యాంద్ర సూర్యనారాయణ పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

▸▸ నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అర్జీల సత్వర పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన 13 వినతులను ఆయన స్వీకరించారు. రేషన్ కార్డులు, పెన్షన్లు, మునిసిపాలిటీ, భూ సమస్యలు తదితర సమస్యలపై వినతులు అందాయి. అలాగే ప్రభుత్వ పాఠశాల నైట్ వాచ్‌మెన్, శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టి.చిన్నబాబు ఆధ్వర్యంలో ఐదు నెలల జీతాల బకాయిలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదనవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వస్తున్న అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో మౌనికకు బంగారు పతకం



బంగారు పతకం, కప్పుతో బాక్సర్‌మౌనిక

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి మహిళా బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం నింజాస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న బొంతు మౌనిక బంగారం పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్రలోని బుస్వాల్‌లో జరిగిన ఈ పోటీలలో మౌనిక 80 కిలోల విభాగంలో పాల్గొని విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా శాప్ కోచ్ అబ్బు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ ఐ.వెంకటేశ్వరరావు, నింజాస్ అకాడమీ కోచ్ వై.శేఖర్ తదితరులు మౌనికను అభినందించారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం



రికార్డులు తనిఖీ చేస్తున్న బృందం ప్రతినిధులు

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట హెల్త్ వెల్‌నెస్ సెంటరు పనితీరుపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం పరిశీలించింది. బృందం సభ్యులు లూసి, ఎ.రామచంద్రరరావు, జగదీశ్, జగన్నాథం ప్రజలకు ఏయే సేవలు అందుతున్నాయి.. అక్కడకు వస్తున్న రోగులకు ఇచ్చే మందులు... గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాల వేస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. పాఠశాలకు వెళ్లి రక్త పరీక్షలు చేసి వివిధ రకాల వ్యాధులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు సునీత, పుష్పరాజు, బి.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ అనంత లక్ష్మి, ఏఎస్ఎం ఆర్.సత్యవతి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మట్టి కళా కృతులు



మట్టితో బొమ్మ తయారుచేస్తున్న విద్యార్థిని

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలల ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన మట్టి కళా కృతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం వివిధ పాఠశాలల నుంచి పోటీలలో పాల్గొన్న విద్యార్థులు మట్టితో బొమ్మలు తయారు చేసి ప్రదర్శించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ మాట్లాడుతూ జూనియర్స్ సీనియర్స్ విభాగాలలో ఈ పోటీలు నిర్వహించామని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పల్లకీ సేవ



పురవీధుల్లో స్వామికి పల్లకీ సేవ చేస్తున్న అయ్యప్పస్వాములు

రావికమతం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప స్వామికి ఘనంగా పల్లకీ సేవ, తిరు వీధోత్సవం నిర్వహించారు. ఇక్కడ శివ పంచాయతీన ఆలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సుమారు వంద మంది భక్తులు అయ్యప్ప మాలాధారణ వేసి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని స్వాములు, గ్రామస్థులు సోమవారం గ్రామ పురవీధుల్లో అయ్యప్పస్వామికి పల్లకీ సేవ చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణ, శరణు గోషతో పుర వీధులు మార్మోగాయి. గురుస్వామి పాతాళ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంజి మంగ మోదునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు వేపాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు యువత కృషిచేయాలి

రోలుగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నివారణకు యువత కృషి చేయాలని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సంకల్ప కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి ఆట కట్టించడానికి పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నామని, టోల్ ఫ్రీ నంబర్ 14500 లేదా సమీపంలో పోలీసు వారికి తెలపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో నష్టాలపై అవగాహన అవసరం

గొలుగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో వచ్చే నష్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ రామారావు సూచించారు. మండలంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలతో నష్టాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ భూమిలో అక్రమ సాగు

లింగంపేట నూకాలమ్మ మాన్యంలో ఎంచెక్కా కొబ్బరి సాగు

అధికారులకు టీడీపీ నాయకుల ఫిర్యాదులు

తూతూమంత్రంగా విచారణ చేస్తున్నారని ఆరోపణలు

కృష్ణాదేవిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ ఆలయ భూముల్లో అక్రమంగా పంటలను సాగు చేస్తున్నారు. సుమారు ఆరు ఎకరాల్లో కొంత మంది ఎంచెక్కా కొబ్బరి, ఇతర పంటలను అంతర పంటలను పండిస్తున్నారు. దీనిపై ఇప్పటికే టీడీపీ నాయకులు దేవాదాయశాఖ ఈవో దివ్యతేజకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు భూముల్లో సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి.

కొత్తమల్లంపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 36/1లో 36.5 ఎకరాలు నూకాలమ్మ ఆలయ భూములు ఉన్నాయి. వీటిలో పది ఎకరాలు అటవీ సోషల్ పారెస్టుకు ఇవ్వగా, మరో 15 ఎకరాలు రైతులకు వేలంపాట ద్వారా ఇచ్చారు. మిగిలిన భూముల్లో రెండు ఎకరాలు కొబ్బరి తోట ఇచ్చారని అధికారులు తెలిపినప్పటికీ, మరి కొంత సాగు భూములు ఏమయ్యాయనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఇప్పటికే పలు పంటలను సాగు చేస్తున్నారు. తాజాగా రెండు ఎకరాల్లో కొబ్బరి మొక్కలను కూడా వేశారు. అమ్మవారి ఆలయ భూముల్లో అక్రమ సాగుపై ఇప్పటికే దేవదాయ శాఖ ఈవోకు ఫిర్యాదులు చేశామని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గొలకొండ శ్రీకాంత్, రమణ తదితర టీడీపీ నాయకులు తెలిపారు. అధికారులు ఏం చర్యలు తీసుకున్నారోగాని, అక్రమార్కుల్లో తీరు మాత్రం మారలేదని వారు ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఈ విషయంపై దేవదాయ శాఖ ఈవో దివ్యతేజను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా రెండు ఎకరాల్లో కొబ్బరితోట వేశారని, అందులో అంతర సాగు చేస్తున్నట్టు గుర్తించి రాంబాబు, తాతబ్బాయిలకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. వీఆర్‌పీ చెప్పడంతో సాగు చేస్తున్నట్టు వారు వివరణ ఇచ్చారన్నారు. త్వరలో వీఆర్‌పీ నోటీసులు ఇస్తామని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు.





లింగంపేట దేవదాయ శాఖ భూముల్లో అక్రమ సాగు చేస్తున్న పంటలు... కొబ్బరి మొక్కలు వేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)





మాడుగుల శివాలయంలో వేకువజామున భక్తుల పూజలు... మాకవరంపాలెం: తామరం రామలయంలో రుద్ర పూజ చేస్తున్న భక్తులు

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పురాతన ఆలయంగా ప్రసిద్ధి గాంచిన బలిఘట్టం శ్రీ బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు భారీ క్యూ లైన్‌లో ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ అధికారులు భక్తుల సౌకర్యార్థం అభిషేకాలు ఆపేసి ప్రత్యేక దర్శనాలకు అవకాశం కల్పించారు. నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తడంతో స్వామివారి దర్శనానికి రెండు గంటలు సమయం పట్టింది. మహిళలు ధ్వజ స్తంభం, నందీశ్వరుడు, ఉసిరి చెట్టు వద్ద దీపారాధన నిర్వహించి పూజలు చేశారు. నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి, పెదబొడ్డేపల్లి శివాలం వద్ద భక్తులు విశేష పూజలు చేశారు.

మాడుగులలో...

మాడుగుల: శివ నామస్మరణంతో ఆలయాలు మార్మోగాయి. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో మాడుగుల కేంద్రంలోని శివాలయాలకు తెల్లవారుజామునే భక్తులు చేరుకున్నారు. కృష్ణ భూపాలేశ్వర, ఉబ్బలింగేశ్వర, భీమలింగేశ్వర, స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. ఆలయాలకు వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాడుగుల రూరల్: మండలంలోని పలు శివాలయాలకు భక్తుల తాకిడి నెలకొంది. కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో వేకువ జాము నుంచి శివాలయాల్లో భక్తులు క్యూల్లో నిరీక్షించి మరీ స్వామివారి దర్శనం చేసుకున్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా తామరం రామాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ రవిశంకర్ గురూజీ శిష్యుల ఆధ్వర్యంలో రుద్ర పూజ నిర్వహించారు. ఎంతో పవిత్రమైన కార్తీక మాసంలో ప్రత్యేక పూజలతో పాటు రుద్రపూజలు నిర్వహిస్తున్నట్టు గురూజీ తెలిపారు. సోమవారం నిర్వహించిన రుద్ర పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భజనలు నిర్వహించారు. .

రావికమతంలో...

రావికమతం: మండలంలోని రావికమతం, కొత్తకోట, మేడివాడ, కవ్వగుంట గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిలాడాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. అలాగే ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించి భక్తితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావికమతం శివ పంచాయతన ఆలయంలో రాచకొండ ఆంజనేయమూర్తి, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమం నిర్వహించారు. పలువురు దాతలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండలంలోని కె.కోటపాడు, గొండుపాలెం, మేడిచర్ల, చౌడువాడ, ఆర్లి, చంద్రయ్యపేట, ఎ.కోడూరు, సింగన్నదొరపాలెం, ఆనందపురం, లంకవానిపాలెం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు శివాలయాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గవరపేట పరమేశ్వర మందిరంలో రాత్రి భజన కార్యక్రమం జరిగింది.

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని శివాలయాలకు భక్తులు వేకువజాము నుంచి పోటెత్తారు. చీడికాడ, తురువోలు, ఖండివరం, ఎల్‌బి.పట్నం, బి.సింగవరం, పెదగోగాడ గ్రామాల్లోని శివాలయాలు, కోనాంలో శివపార్వతుల విగ్రహాల వద్దకు వెళ్లి భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి ప్రత్యేకంగా పూజలు చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు... పార్టీలో చేరికలు



పీవీఎస్ఎన్ రాజు సమక్షంలో వైసీపీని వీడి జనసేనలో చేరిన కార్యకర్తలు

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సేమునాపల్లి గ్రామానికి చెందిన 15 మంది వైసీపీ కార్యకర్తలు సోమవారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాల పట్ల యువకుల్లో నమ్మకం పెరిగిందని, దీనికి నిదర్శనం పార్టీలో పెరుగుతున్న చేరికలేనని చెప్పారు. పవన్ సారథ్యంలో వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో జనసేన బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయినుంచి పార్టీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కాగా, శేమునాపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి తెలుగుచెర్ల మహేష్, ఎల్లపు ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో సురేష్, దాడి విష్ణు, మణికంఠ, జయసూర్య, భానుప్రసాద్, యువతేజ, గుమ్మాల చిన్న, రాజేష్, లంక పురుషోత్తం, వంశీ తదితరులు వైసీపీని వీడి జనసేనలో చేరారు. వారిని రాజు సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాను కప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, వీరమహిళా అధ్యక్షురాలు నరవ సరోజిని, పార్టీ నాయకులు మంగా శ్రీను, కొప్పు సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

▸▸ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నేతలతో సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారులు అధిక ధరల విక్రయాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం స్పందించి వ్యాపారుల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరారు. ఉత్తరాంధ్రలోని సాగునీటి వనరుల అభివృద్ధి చేపట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ అంబటి రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జల వనరుల శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు

నాతవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ నర్సీపట్నం బ్రాంచి వర్క్ చార్జుడు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.పోతురాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. నర్సీపట్నం బ్రాంచి అధ్యక్షుడిగా బీవీ నగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అప్పారావు, ఉపాధ్యక్షులుగా కె.సత్యనారాయణ, కె.బంగ్రారాజు, కె.సూరిఅప్పారావు, కార్యదర్శులుగా డి.రాజుబాబు, బి.సత్యనారాయణ, పి.సన్యాసినాయుడు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.రాజులు, బి.అప్పలనాయుడు, పి.నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.సిహెచ్.నాగేశ్వరరావు సిహెచ్.అప్పలనాయుడు వి.నూకరాజు, యు.అనంద్, కోశాధికారిగా ఎ.ఆదిలక్ష్మి, సహాయ కోశాధికారిగా కె.ఇమ్మానుయేల్‌ను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగయ్యపేటకు చెందిన చలుమూరు మంగబాబు తీవ్రంగా గాయపడ్డాడు. మంగబాబు ద్విచక్ర వాహనంపై సోమవారం దేవరాపల్లి నుంచి నాగయ్యపేట వెళ్తున్నాడు. ఆగివున్న సరుగుడు కర్రల ట్రాక్టరు తప్పిస్తుండగా ఎదురుగా బస్సు రావడంతో సరుగుడు కర్రలు ఛాతికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో దేవరాపల్లి పీహెచ్‌సీలో చేర్పగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్ తరలించారు. అయితే కుటుంబీకులు మంగబాబును ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు.

జైతవరంలో అన్నసమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

చీడికాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జైతవరం గ్రామంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఆహారం వడ్డించారు. అంతకు ముందు శివపార్వతుల విగ్రహాలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళ కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్తీకమాసం ముగిసేలోపు ఇలాంటి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని గవిరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు, టీడీపీ నాయకులు బొడ్డు కృష్ణ, బొడ్డు కన్నంనాయుడు, రెడ్డి కాశీవిశ్వనాధం, అన్నదారపు మహేశ్వరరావు, రెడ్డి వాసు, బొడ్డు నాగరాజు, కొనగల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

రావికమతం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి వినియోగదార్ల సంఘాలకు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల నిర్వహణ శిక్షణ అధికారి డి.సూర్యనారాయణరావు సూఇంచారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఎన్నికల నిర్వహణ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13 సాగునీటి వినియోగదార్ల సంఘాలకు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల రోజు ఉదయమే నామినేషన్ల ప్రక్రియ, మధ్యాహ్నం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించరాదని, నిష్పక్షపాతంగా ఎన్నిక జరిపించాలని ఆయన సూచించారు.

వేచలంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

దేవరాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేచలం గ్రామంలో సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 31 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసినట్టు పశువైద్యాధికారి జి.ప్రియాంక తెలిపారు. అలాగే 16 ఎదకు రాని పశువులకు, 17 పెయ్యలకు నట్టల నివారణ మందులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో దేవరాపల్లి వైద్యాధికారి మంజుషారాణి, జిల్లా నోడల్ అధికారి పి.బానుబాబు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సదస్సు జయప్రదం చేయండి

చోడవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో విద్య, ఉపాధి సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 15న జరగనున్న విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌వో విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందారపు భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఉత్తరాంధ్ర ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. యువతను గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చి వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో నాయకులు శివాజీ, రామకృష్ణ, అఖిల్, మణికంఠ, యశ్వంత్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కె.కోటపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. 12న అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొంటారన్నారు. 13వ తేదీన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు పాల్గొంటారన్నారు. ఈ శిక్షణకు సభ్యులంతా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వ్యాధుల నియంత్రణపై అవగాహన

రావికమతం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై ఆశా కార్యకర్తలకు ఆయుష్ మిషన్ వైద్యాధికారి శ్రీదేవి అవగాహన కల్పించారు. జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీల ఆశా కార్యకర్తలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీల వైద్యాధికారులు దుర్గా ప్రసాద్, రజినీ తదితరులు పాల్గొన్నారు.

18న పేదల ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

కె.కోటపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల స్థలాల కోసం గ్రామ సచివాలయాల వద్ద ఈ నెల 18న లబ్ధిదారులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం కింతాడ శివారు రామచంద్రపురంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఎన్నికల హామీ మేరకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలంతో పాటు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రెడ్డి అప్పలనాయుడు, మండల దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి ఇల్లాకు రాము, సీమసిరి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత సిలిండర్లు

నాతవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డు కలిగిన అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందిస్తున్నదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుక్ చేసుకున్న వారికి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయని చెప్పారు. గ్యాస్ లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే 1967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

మాకవరపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతి సందర్భంగా సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొరువాడ పాఠశాల ఉపాధ్యాయురాలు గుండెపోటుతో మృతి



అన్నపూర్ణ (ఫైల్)


కె.కోటపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరువాడ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.అన్నపూర్ణ ఆదివారం సాయంత్రం గుండె పోటుతో మృతి చెందారు. ఆమె భర్త రవికుమార్ వేపాడ మండలంలో వీవోఆర్‌డీగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. టీచర్ మరణ వార్త విన్న పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామ నాయకులు, ప్రజలు సంతాపం తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఓటరు జాబితా విడుదల

మాడుగుల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను విడుదల చేశామని తహసీల్దార్ కె.రమాదేవి తెలిపారు. ఈ నెల 23న జరుగనున్న నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి అన్ని సంఘాల ఓటరు జాబితాలను సోమవారం విడుదల చేశామని చెప్పారు. ఈ జాబితాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలని తహసీల్దార్ కోరారు.

సీఎం చంద్రబాబుని కలిసిన కిడారి

▸ జీసీసీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపిన శ్రావణ్


సీఎం చంద్రబాబుతో శ్రావణ్‌కుమార్

పాడేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు జీసీసీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన అధినేతకు కృతజ్ఞతలు తెలిపి, ఆశీర్వాదం పొందారు. జీసీసీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కిడారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

కేన్సర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

▸ పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ దినేశ్‌కుమార్


కేన్సర్ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, తదితరులు

పాడేరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేన్సర్ నిర్ధారణకు నిర్వహించే పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో కేన్సర్ నిర్ధారణ పరీక్షల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి మూడు రకాల కేన్సర్‌కు సంబంధించి పరీక్షలను నిర్వహిస్తారన్నారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఆయా పరీక్షలను నిర్వహిస్తారన్నారు. 18 ఏళ్లు నిండిన పౌరులకు, 30 ఏళ్లు పైబడి వయస్సు ఉన్న మహిళలకు కేన్సర్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్‌బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐపీపీబీ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

▸ తపాలా శాఖ అనకాపల్లి సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్



పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులోని ఐపీపీబీ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని అనకాపల్లి డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ పోస్టాఫీసులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందడం లేదన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల నగదు నేరుగా పోస్టాఫీసు అకౌంట్‌లలో పొందడానికి ఆధార్ సీడింగ్ తప్పనిసరన్నారు. డివిజన్‌లో 2.6 లక్షల మంది ప్రజలకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ సీడింగ్ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ప్రతీ సచివాలయ పరిధిలో పోస్టాఫీసు ద్వారా ఐపీపీబీ అకౌంట్‌ను ఓపెన్, ఆధార్ అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అనకాపల్లి డివిజన్ పరిధిలో ఉన్న 2 హెడ్ పోస్టాఫీసులు, 45 సబ్ పోస్టాఫీసులు, 559 బ్రాంచి పోస్టాఫీసులలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీవో 3కి చట్టబద్ధత కల్పించాలి : సీపీఎం


రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు

గూడెంకొత్తవీధి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):శాసనసభ సమావేశాల్లో జీవో-3కి చట్టబద్ధత కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి బుజ్జిబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం సీపీఎం, గిరిజన సంఘం, టీడీపీ నాయకులు జీవో -3ను పునరుద్ధరించాలని ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండలాధ్యక్షుడు ముర్ల చంటిబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్, మన్యపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు వనపల సోమేశ్ కుమార్, నీలకంఠం, రాజు, వైసీపీ నాయకులు కొర్ర బాబి పాల్గొన్నారు.

ఏఎస్ఆర్ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన గ్లోబల్ ఫౌండేషన్ సీఈవో


గ్లోబల్ ఫౌండేషన్ సీఈవో భూపతిరాజును సత్కరించిన దృశ్యం

అరకులోయ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అరకులోయ అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్‌ను గ్లోబల్ ఫౌండేషన్ సీఈవో భూపతిరాజు పండేటి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిత్యం కృషి చేయాలని సూచించారు. అలాగే క్రమశిక్షణ విద్యను అభ్యసించాలని, ఉన్నత స్థాయి చేరుకోవాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో మరిన్ని గ్రామాలను దత్తత తీసుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పలు గ్రామాలను దత్తత తీసుకొని విద్య, వైద్యం, తాగునీటి కల్పన తదితర సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని ఈ సందర్భంగా పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. అనంతరం సీఈవో భూపతిరాజును ఘనంగా సత్కరించారు.

కాఫీ సేకరణపై గిరిజనులకు అవగాహన

డుంబ్రిగుడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోవ్వా పంచాయతీ పరిధిలోని సాగరవలస, గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామ పంచాయతీ కేంద్రంలో కాఫీ పంట సేకరణ, ఐటీడీఏ, జీసీసీ కొనుగోలు ధరలపై సోమవారం గిరిజనులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ కాఫీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఐటీడీఏ, జీసీసీ కాఫీ పండ్లను కిలో రూ.44, పార్చ్‌మెంట్ కాఫీని రూ.285 చెర్రీ కాఫీని రూ.150లు చొప్పున కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి మత్స్యరాజు, ఫీల్డ్ కన్సల్టెంట్, కాఫీ రైతులు పాల్గొన్నారు.

అనుమానితులపై బైండోవర్ కేసులు

పెదబయలు, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం నుంచి మండలానికి వచ్చిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు, ఎస్‌ఐ రమణ తెలిపారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఈ నెల 8న ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామంలో అర్ధరాత్రి సమయంలో రెండు కార్లతో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించారని, గ్రామస్థులు వారిని పోలీసులకు అప్పగించారని చెప్పారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారన్నారు. వారిని విచారించగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందినవారిగా తేలడంతో కేసులు పెట్టి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్టు చెప్పారు.

హరహర మహాదేవ.. శంభో శంకర...

▸ భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


భక్తులతో కిటకిటలాడిన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయం, స్వయంభూ గౌరీ నీలకంఠేశ్వరుని ఆలయం, త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయాలు సోమవారం వేకువజాము 5 గంటల నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు శివునికి ప్రత్యేక అర్చనలు, పూజలను చేపట్టారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రసాదం, తాగునీటి


సీలేరు శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, వంతినిభ రాజబాబు, దేశిది బాబూరావు, సిద్ధినాతి కొండలరావు, బీవీఎస్.ముకుందరావు, ఉప్పల వెంకటరత్నం ఆధ్యాత్మిక మహిళా బృంద సభ్యులు పాల్గొన్నారు.

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ శివాలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి శివ నామస్మరణతో మార్మోగింది. కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజాము నుంచి శివాలయంలో బారులు తీరారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు సీలేరు నదిలో స్నానాలను ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే శివాలయంలో పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

అరకులోయలో...

అరకులోయ: మండలంలోని శివాలయాల్లో కార్తీక సందడి కనిపించింది. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేయించారు. ఓ వైపు చలి వణికిస్తున్నప్పటికీ ఏమాత్రం లెక్క చేయకుండా స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అరకులోయ శివాలయంలో భక్తులు తెచ్చిన పంచామృతాలను స్వీకరించిన ఆలయ ప్రధాన అర్చకులు వెంకన్న, మూర్తి పూజలు అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో దీపారాధన నిర్వహించారు.


అరకులోయ శివాలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

చిన్నారుల ఎదుగుదలపై పర్యవేక్షణ కీలకం

▸ ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి

▸ లగిశపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ


లగిశపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎదుగుదలను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

పాడేరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ ఎంతో కీలకమని, దానిపై అంగన్‌వాడీ అధికారులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని లగిశపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు పరిశీలించి, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు పక్కాగా పోషకాహారం, సేవలు అందించాలని, పూర్వప్రాథమిక విద్యపై శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే బాల్య వివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, అత్యవసర సేవల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లను ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రదర్శించాలన్నారు. లగిశపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ఇతర సేవలపై సంతృప్తి చెంది అంగన్‌వాడీ కార్యకర్త ఇంద్రకుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

▸ డీఎస్పీ షహబాజ్ అహమ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ హెచ్చరించారు. సోమవారం ఉదయం స్థానిక పోలీసు స్టేషన్‌లో లంబసింగి, తాజంగి పంచాయతీల పరిధిలోనున్న రిసార్ట్స్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబసింగి వచ్చే పర్యాటకులకు రిసార్ట్స్ నిర్వాహకులు మంచి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. పర్యాటకులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. రిసార్ట్స్ పరిసరాల్లో సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. సందర్శకుల ఆధార్, వ్యక్తిగత చిరునామాను రిజిస్టర్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైన సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్‌ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

రిసార్ట్స్ నిర్వాహకులు అనుమతులు కలిగి ఉండాలి

పర్యాటక ప్రాంతాల్లో రిసార్ట్స్ నిర్వాహకులు విధిగా పూర్తి స్థాయి అనుమతులు కలిగి ఉండాలని స్థానిక తహసీల్దార్ రవికుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశమందిరంలో రిసార్ట్స్ నిర్వాహకులతో మండల పర్యాటక కమిటీ అధికారులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిరాయితీ భూమిలో మాత్రమే రిసార్ట్స్, టెంట్లు నిర్వహించాలన్నారు. ప్రతి టెంట్, రిసార్ట్స్ నిర్వాహకులు పోలీసు, ఫైర్, విద్యుత్‌శాఖ, ఎంపీడీవో అనుమతి పొందాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రిసార్ట్స్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్యం నిర్వాహణ కోసం ఒక్కొక్క టెంట్‌కి రూ.250, రిసార్ట్స్ గదికి రూ.500చొప్పున నెలకు పంచాయతీకి చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. వాటర్ ప్యాకెట్లు, 500ఎంఎల్, ఒక లీటరు బాటిల్స్‌ని నిషేధించడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ ఏఈఈ వనుము ప్రభాకరరావు మాట్లాడుతూ మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేలు గిరిజనులకు అవసరమా?

▸ బీజేవైఎం అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కొండబాబు



పాడేరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గిరిజన సమస్యలపై చట్టసభల్లో పోరాటం చేస్తామని ప్రకటిస్తూ, అసెంబ్లీ సమావేశాలకు వెళ్లని పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు గిరిజనులకు అవసరమా? అని బీజేవైఎం అరకు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పీఎం.కొండబాబు ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ సమస్యలపై ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో ప్రస్తావించడం, లేదా పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకంతోనే గిరిజనులు వారికి ఓట్లేసి ఎమ్మెల్యేలుగా ఎన్నుకుంటే, ప్రజల కోసం వాళ్లు ఏమి చేయడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోతే ఎమ్మెల్యేలుగా గెలిచి గిరిజనులకు ఏం ప్రయోజనమని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సభ్యత్వం రద్దు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆఖరికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రోజు సైతం అసెంబ్లీకి వెళ్లలేదని, వాస్తవానికి బడ్జెట్ సమావేశాలకు వెళ్లి గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మరింత నిధులు కేటాయించాలని డిమాండ్ చేయాల్సిన ఉండగా, అందుకు భిన్నంగా ఇళ్లకే పరిమితం కావడం ఘోరమన్నారు. ఇటువంటి ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అరకు, డుంబ్రిగుడలో సబ్ కలెక్టర్ పర్యటన


అరకులోయలో ఖాళీ స్థలాల మ్యాప్‌లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్... డుంబ్రిగుడలో పట్టా భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

అరకులోయ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సోమవారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న దుకాణాలు, ఆక్రమణలను స్థానిక తహసీల్దార్ ఎంవీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాలను, రహదారికిరువైపులా ఉన్న దుకాణ సముదాయాలను, ఫుట్‌పాత్ ఆక్రమణలను నిశితంగా పరిశీలించారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఏపీ టూరిజం, పోర్టు ట్రస్టు అతిథిగృహాల ప్రహరీ గోడలకు, రహదారికి మధ్య ఖాళీగా ఉన్న స్థలాలను చూశారు. ఆక్రమణలు గుర్తించడంతో పాటు వాటిని తొలగింపు, ప్రత్యామ్నాయ స్థలాలపై ఆరా తీశారు. వ్యవసాయ, పట్టుపరిశ్రమలు పశు సంవర్థక శాఖలకు సంబంధించి స్థలాలు, వాటిలో ఉన్న ఆక్రమణల గురించి సంబంధించి శాఖల అధికారులు కనీం స్పందించడం లేదని ఈ సందర్భంగా స్థానికులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. పశు సంవర్థక శాఖకు చెందిన స్థలంలో దుకాణ సముదాయాలపై వివరణ కోరగా, గ్రామ పంచాయితీ వారు నిర్మిస్తున్నారని, వాటిపై విచారణ జరుగుతుందని చెప్పారు. అలాగే ఆ శాఖకు ఏ మేరకు స్థలం కేటాయింపులు చేశారో సర్వే చేయించి నివేదిక అందజేస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సోమవారం పర్యటించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టా భూములు కోల్పోయిన అర్హులైన గిరిజనులకు పరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణా చేస్తే కఠిన చర్యలు

▸ ఎస్పీ అమిత్ బర్దర్



జి.మాడుగులు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలభం పంచాయతీ దేగలరాయి గ్రామ పరిసరాల్లో వెయ్యి గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్టు జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. సోమవారం దేగలరాయిలో రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి డ్రోన్ల సాయంతో గంజాయి సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా 200 ఎకరాల్లో డ్రోన్ల ద్వారా పరిశీలన చేయగా.. 20 స్థలాల్లోని ఐదు ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఇందులో ఉన్న వెయ్యి గంజాయి మొక్కలను రెవెన్యూ, పోలీసు సిబ్బంది ధ్వంసం చేసినట్టు ఎస్పీ అమిత్ బర్దర్ చెప్పారు. ఈ స్థలాలకు సంబంధించి రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు సేకరించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ, ఎస్ఐ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం : గిరిజన సంఘం


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మన్నపడాల్, బాలదేవ్

పాడేరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మన్నపడాల్, పి.బాలదేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదివాసీలకు కేవలం రూ.7,557 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని వారు వ్యతిరేకించారు. జనాభా ప్రాతిపదికన ఆదివాసీలకు 6.57 శాతం అంటే బడ్జెట్‌లో రూ.19,374 కోట్లు కేటాయించాల్సి ఉండగా.. కేవలం 2.57 శాతం రూ.7,557 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. బడ్జెట్‌లో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రస్తావన లేక పోవడం ఆదివాసీలను దగా చేయడమేనన్నారు.

46 మద్యం సీసాలు స్వాధీనం

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాహనంలో తరలిస్తున్న 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. కూర్మారావు తెలిపారు. సోమవారం ఎక్సైజ్ పోలీసులు లంబసింగి జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఒక వ్యక్తి వాహనంలో 46 మద్యం బాటిల్స్‌ను తరలిస్తూ పట్టుబడ్డాడు. మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడుని అరెస్టు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ సోమయ్య, హెచ్‌సీ కుమార్, కానిస్టేబుల్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

సీలేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కాలేజీలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు విద్య ఆవశ్యకతపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 50 మంది ఇంటర్ విద్యార్థులు పాల్గొనగా.. సెకండ్ ఇయర్‌కు చెందిన పి.సంకీర్తన ప్రథమ స్థానంలో నిలవగా, కె. వెంకటలక్ష్మి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అనంతరం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరరావు మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రిగా మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ విద్యా రంగంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారని కొనియాడారు.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డి.శ్రీను, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి'


బిర్సాముండాకు నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గూడెంకొత్తవీధి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొండ్ల చిరంజీవి అన్నారు. సోమవారం పార్టీ మండలాధ్యక్షుడు వనపల జోగిరాజు అధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. గిరిజన ప్రాంతంలోనూ బీజేపీకి ప్రజాదరణ పెరిగిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అనంతరం ఆదివాసీ ఉద్యమ నేత బిర్సాముండ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, నాయకులు చల్లంగి అచ్యుత్, లకే రాము, లక్ష్మణ్, రామచంద్ర పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు ప్రయాణంపై అవగాహన లేక ప్రమాదాలు: డీఎస్పీ వేణుగోపాల్

అనంతగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘాట్ రోడ్డు ప్రయాణాలపై అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయని పాడేరు ఇన్‌చార్జి డీఎస్పీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని ఎన్ఆర్‌పురం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం వ్యాన్ బోల్తాపడి ఒకరు మృతిచెందగా.. పలువురు గాయపడిన విషయం విదితమే. ఈ సంఘటనా స్థలాన్ని సోమవారం డీఎస్పీ వేణుగోపాల్, అదనపు రవాణా శాఖ అధికారి శ్యాంబాబు, ఎస్ఐ డి.శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ అనంతగిరి, పాడేరు, ఎన్ఆర్‌పురం ఘాట్ రోడ్లపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలోని ఆర్ఐ జగ్గయమ్మ, ఏఎంవో వాసు, వీఆర్వో విజయమణి, వీఆర్ఏ మహేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించండి

అనంతగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని పంచాయతీ కార్యదర్శులతో సోమవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో పారిశుధ్యంపై దృష్టిపెట్టాలన్నారు. ప్రతీ హోటల్, కిరాణా దుకాణం వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ లాలం సీతయ్య పాల్గొన్నారు.

నిరాక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

అనంతగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరాక్షరాస్యులను అక్షరాస్యులగా తీర్చిదిద్దేందుకు వెలుగు వీవోఏలు కృషిచేయాలని ఎంఈవో కిల్లో బాలజీ సూచించారు. వెలుగు కార్యాలయంలోని సోమవారం ఎంపీడీవో కుమార్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ప్రతీ వీవోఏలు పది మందిని అక్షరాస్యులగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలన్నారు. సీడీపీవో సంతోషికుమారి, జిల్లా కోఆర్డినేటర్ గంగన్నదొర పాల్గొన్నారు.

ప్రత్యేక దత్తత సంస్థ ప్రారంభం

» పిల్లలు లేని వారు దరఖాస్తు చేసుకుంటే దత్తత : కలెక్టర్ విజయకృష్ణన్


ప్రత్యేక దత్తత సంస్థలో చిన్నారిని ఎత్తుకుని ముద్దాడుతున్న కలెక్టర్

కొత్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని బాలకృష్ణ బస్టాండ్ వద్ద మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దత్తత సంస్థను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 6 సంవత్సరాల వయస్సు కలిగిన (తల్లి దండ్రులు కోల్పోయిన పిల్లలు/ వదిలి వేయబడిన పిల్లలు/ తల్లిదండ్రులు బిడ్డను పెంచుకోలేక సంస్థకు అప్పగించిన పిల్లలు) వారి కోసం 24 గంటలూ ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ సంస్థలో మేనేజర్, సామాజిక కార్యకర్త, ఏఎన్‌ఎం, ఆయాలు, చౌకీదార్ సిబ్బంది పనిచేస్తారన్నారు. సంస్థలో పిల్లలను కేంద్ర దత్తత వనరుల సంస్థ ద్వారా పిల్లలు లేని వారు దత్తతకు దరఖాస్తు చేసుకుంటే వారికి దత్తత ఇచ్చేందుకు పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి కె.అనంతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రభావతి, నోడల్ అధికారి ఎల్.సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఇక్కడి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. జీవో నంబరు 17 వల్ల దారి మళ్లిన నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేయాలని, 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకు ఖర్చు చేయాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా 55 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వారంతా నినాదాలు చేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ ఇసుకను ఏజెన్సీలకు అప్పగించడం తగదన్నారు. అలాగే అనకాపల్లిలో ఇసుక డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైఎస్ భద్రం, రాజాన దొరబాబు, సన్యాసిరావు, నూకరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలో 103 మంది అర్జీలు


గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ గణేశ్

సబ్బవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభల్లో భాగంగా సోమవారం మండలంలోని పైడివాడఅగ్రహారంలో జరిగిన కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. వీరిలో ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం చేయాలని అధికశాతం విన్నవించారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.గణేష్ ఆధ్వర్యంలో ఇక్కడ గ్రామ సభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఇటువంటి సభలు దోహదపడతాయన్నారు. దీంతో వివిధ రకాల భూ సమస్యలపై 103 మంది అర్జీలను సమర్పించారు. వీటన్నింటినీ పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి, దుర్గినాయుడు, గొంతిన పైడిరాజు, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, మోహనరావు, శ్రీనివాసరావు, వీఆర్‌వోలు సౌజన్య, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, నవం బరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు సోమవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల ముందు కూటమి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించినందున ఆ హామీని అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై సుమారు రూ.2.45 లక్షల రుణ భారం పడిందని వాపోయారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతాంగం సాగు చేస్తున్న పంటలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా సొమ్ము భరించి ఆదుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరాలశెట్టి సత్యనారాయణ, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి : ఎండమూరి



కశింకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 'విజయ మార్గానికి సోపానాలు' అం శంపై స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ నవలా రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ యండమూరి వీరేంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు భయం విడిచి ధైర్యంగా తమ లక్ష్యాలను సాధించుకునేందుకు పలు సూత్రాలు తెలియజేశారు. విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని, ఆత్మవిశ్వాస్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి'

తుమ్మపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజానదొరబాబు కోరారు. సోమవారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెరిగిన సిమెంట్, ఇసుక, ఇనుము ధరలతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించడంతో పాటు రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. నాయకులు కె.ఎస్.సన్యాసిరావు, వైఎస్ భద్రం, చెల్లూరి నాగరాజు పాల్గొన్నారు.


అనకాపల్లిలోని ఓ ఆలయంలో శివునికి క్షీరాభిషేకం


శివ పార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు


సబ్బవరం : పైడివాడలోని స్వయంభూ నందీశ్వరుని ఆలయంలో...

హర హర శంభో..

» కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిట

» వేకువజాము నుంచి స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు


అనకాపల్లిలో కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో అభిషేకాలు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణతో హోరెత్తాయి. వేకువజాము నుంచే విశేష పూజలు ప్రారంభం మయ్యాయి. అనకాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర, భోగలింగేశ్వర ఆలయాలతో పాటు కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయం తదితరాల్లో స్వామివారికి పంచామృతాలతో అభిషేకించారు. ఇదిలావుంటే, మెయిన్‌రోడ్డులో గల కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాడి గణేశ్, సుష్మా దంపతులు, పార్వతి, శ్రీనివాస్, సత్యలు స్వామివారికి కల్యాణం జరిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. ఎంపీ సీఎం రమేష్ మేనల్లుడు విజయ్ ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.అబ్బులు, నూకాంబిక ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ బుద్ద శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, కుంచావారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి స్వామికి పూజలు ప్రారంభమయ్యాయి. తాడి నీలకంఠేశ్వరస్వామి ఆలయం, దీపాంజలినగర్, దేశపాత్రునిపాలెం, పరవాడ, లేమర్తి, భరణికం తదితర గ్రామాల్లో ఆలయాల్లో అభిషేకాలు జరిపారు.

సబ్బవరం : మండలంలోని శైవక్షేత్రాలు కార్తీకసోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. పైడివాడలోని స్వయంభూ నందీశ్వరస్వామి ఆలయం, దేవీపురంలోని దక్షవటి, వంగలి, లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి ఆలయాలు, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, గొర్లివానిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి, పెదయాతపాలెంలోని గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం, గణపతిపురంలోని మల్లికార్జునస్వామి, మొగలిపురంలోని విఘ్నేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా రుద్రాభిషేకాలతో పాటు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.


పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు పూజలు

ఘనంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి


ఆజాద్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ


డైట్‌లో విద్యార్థులు, అధ్యాపకుల నివాళి


సబ్బవరం కళాశాలలో ..

అనకాపల్లి రూరల్, నవంబరు 11 : ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో మైనార్టీస్ వెల్ఫేర్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి ఎస్పీ తుహిన్ సిన్హా పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడుగా, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నిర్విరామంగా పనిచేసి జాతీయ అభివృద్ధికి, విద్యారంగం అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు. తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ మొదటి విద్యా శాఖ మంత్రి డాక్టర్ మౌలాన అబుల్ కలాం అజాద్ నేటి యువతకు ఆదర్శమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ అన్నారు. కళాశాలలో సోమవారం కలాం జయంతిని నిర్వహించిన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను వివరించారు. అధ్యాపకలు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఏవీ రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్.గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

» విద్యార్థులు, యువత వీటికి దూరంగా ఉండాలి

» 'సంకల్పం' సదస్సులో పోలీసు అధికారులు


గొన్నవానిపాలెంలోని కళాశాలలో విద్యార్థులతో అధికారులు ప్రతిజ్ఞ

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సూచించారు. పట్టణంలోని సంయుక్త జూనియర్ కళాశాలలో సోమవారం సంకల్పం పేరుతో మాదక ద్రవ్యాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పభావాలను విద్యార్థులకు వివరించారు. మత్తు జోలికి వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకుని కుటుంబానికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు డి.ఈశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

అనకాపల్లి రూరల్ : మాదక ద్రవ్యాలను అలవాటు చేసుకుని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని రేబాకలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సంకల్పం పేరుతో మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల నిజమైన ఆనందాన్ని, సమాజంలో గౌరవాన్ని కోల్పోతారన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల జోలికి వెళ్లబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రవికుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లంకెలపాలెం : విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళితే భవిష్యత్తు నాశనం చేసుకున్నవారవుతారని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెంలో గల గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో సంకల్పం పేరిట విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాదక ద్రవ్యాలు సేవిచడం వలన కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ కృష్ణారావు, గొన్నా విద్యాసంస్థల కార్యదర్శి హేమచంద్‌నాయుడు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : యువత మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు అన్నారు. సోమవారం సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. దేశ ప్రగతిని ముందుకు తీసుకువెళ్లాలని, విద్యార్థినీ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.లక్ష్మణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'స.హ. చట్టం పై అవగాహన అవసరం'

తుమ్మపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. సమాచార హక్కు చట్టంపై సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న పలు కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను తెలుసుకునే హక్కు ప్రతీ పౌరునికి ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి, ఎంపీడీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్ అక్షరాస్యతను' విజయవంతం చేయండి

» ఎంపీడీవో నరసింహారావు

తుమ్మపాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో కేవీ నరసింహారావు సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణపై విద్యాశాఖాధికారులకు సోమవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో టీచర్లంతా నిర్దేశించిన స్వయం సహాయక సంఘాల్లో నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిటరసీ, లీగల్ లిటరసీ పై వివరించారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.చిన్నికృష్ణ, రిసోర్స్‌పర్సన్ కె.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సీహెచ్. కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ పేరుతో సేకరించిన భూములు ఇచ్చేది లేదు

» తేల్చి చెప్పిన వివిధ గ్రామాల రైతులు » తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

కొత్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ పూలింగ్ పేరుతో సేకరించిన అనకాపల్లి మండలం వేటజంగాలపాలెం, పాపయ్యపాలెం గ్రామాలకు చెందిన భూములను ఇచ్చేది లేదని పలువురు రైతులు స్పష్టం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పది మండలాల్లో 54 గ్రామాల్లో 6116.50 ఎకరాల భూ సేకరణ చేయడానికి గ్రామసభలు నిర్వహించారన్నారు. ఆ సభల్లో రైతులు, చిన్న, సన్నకారు రైతులు, కూలీలు, వృత్తిదారులు భూములు ఇవ్వలేమని ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. అయినప్పటికీ కొన్ని చోట్ల యంత్రాలు పెట్టి భూముల్లో ఉన్న పంటలు నాశనం చేశారని ఆరోపించారు. దీంతో హైకోర్టుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు. 2022న ఆ భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించవద్దని, ఎవరైనా స్వచ్ఛందంగా ఇస్తే వాటిని మాత్రమే తీసుకోవాలని చెప్పినప్పటికీ తీర్పును వుడా, రెవెన్యూ సిబ్బంది ఉల్లంఘించారని ఆరోపించారు.

రైతుల నుంచి భూములను బలవంతంగా తీసుకుంటామని చెప్పడం హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘన కిందే వస్తుందని వివరించారు. రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినబాబు మాట్లాడుతూ ఈ భూముల్లో జీడి, మామిడి, ఇతర పంట ద్వారా జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటువంటి భూములను బలవంతంగా తీసుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. అనంతరం తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, గోవింద, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్ననాయకులు, రైతులు

'ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ భారం తగదు'

అనకాపల్లి టౌన్/పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు పట్టణంలోని కూరగాయల మార్కెట్, చిననాలుగు రోడ్ల జంక్షన్ ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారీగా భారాన్ని మోపడం తగదన్నారు. ట్రూ అప్ చార్జీల పద్ధతిని, స్మార్ట్ మీటర్ల బిగించే ప్రయత్నాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, జి.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే, నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పరవాడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వద్ద సీపీఎం మహిళా ప్రతినిధులు కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదల ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ మహిళా ప్రతినిధులు పి. మాణిక్యం, రమణమ్మ, పార్వతి, లక్ష్మి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే బాలికకు గాయలు

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న యశశ్విని అనే విద్యార్థిని ప్రమాదవశాత్తూ వేడి సాంబారులో పడిపోవడం వల్ల తీవ్ర గాయాలకు గురైన నేపథ్యంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని ప్రమాదానికి గురైందని ఆరోపించారు. ఈ సంఘటనను గోప్యంగా ఉంచాలని చూడడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

అభయాంజనేయ స్వామికి విశేష పూజలు



పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం జంక్షన్‌లో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మేజరు పంచాయతీ పరవాడ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ వివిధ కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని వివరించారు.

నకిలీ విలేకరుల ఆట కట్టించాలని వినతి


ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ నాయకులు

అనకాపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా పేరుతో హల్‌చల్ చేస్తున్న నకిలీ విలేకరుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రతినిధులు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా పరిధిలో నకిలీ విలేకరుల హవా ఎక్కువగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సదరు రిపోర్టర్ అక్రిడేషన్ కార్డు లేదా యాజమాన్యాలు ఇచ్చిన ఐడెంటిటీ కార్డులను పరిశీలించాలని కోరారు. అధికారిక కార్యక్రమాలకు సోషల్ మీడియా ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ కారణంగా వర్కింగ్ జర్నలిస్టులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా అధ్య క్షుడు బి.వెంకటేష్, బాషా, శేఖర్, నాగ, నటరాజ్, నాగు పాల్గొన్నారు.

పరారీలో ఉన్నగంజాయి కేసు నిందితుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది పట్టుబడిన గంజాయి కేసులో ఓ వ్యక్తిని ఇక్కడి గూడ్స్‌షెడ్డు వద్ద సోమవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. గతేడాది ఆగస్టు 22న తూము బాలిరెడ్డిని అరెస్టు చేసి అక్రమంగా తరలిస్తున్న 280 కిలోల గంజాయి, కారును సీజ్ చేశామన్నారు. అప్పటి నుంచి ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న జి.మాడుగుల ప్రాంతానికి చెందిన గబ్బాడ నాగేశ్వరరావును అరెస్టు చేసినట్టు సీఐ చెప్పారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం'

పరవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక మంత్రి సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ జిల్లావాసులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో ఆక్షేపించారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి, మూలస్వయంభూవరం గ్రామాల తరలింపు గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమని వాపోయారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలు నడపడం కోసం కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

గిరిజన సంప్రదాయ లోగిలి

గిరి గ్రామదర్శిని

ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలకు ప్రతీక

(అరకులోయ- ఆంధ్రజ్యోతి)

గిరిజనుల ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు, జీవన విధానం కళ్లకు కట్టినట్టు ఉండే ప్రాంతమే గిరి గ్రామదర్శిని. ఇక్కడ గిరిజనుల జీవన విధానానికి సంబంధించిన అనేక రకాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. సందర్శకులు గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో వివాహం చేసుకునే సౌలభ్యం ఇక్కడ ఉండడంతో దీనికి ప్రత్యేకత సంతరించుకుంది.

అరకులోయ ప్రాంతాన్ని సందర్శించే వారికి గిరిజనులు ఆచార వ్యవహారాలను పరిచయం చేయడానికి అరకులోయలోని గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో గిరిజనుల జీవన విధానానికి సంబంధించిన అనేక రకాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. అయితే విశాఖ మన్యాన్ని సందర్శించే పర్యాటకులకు గిరిజనుల జీవ విధానాన్ని ప్రతిమల రూపంలో కాకుండా, పర్యాటకులే గిరిజనుల వేషధారణల్లో, వారి జీవన విధానాన్ని అనుసరిస్తూ, గిరిజనులు ఇలా ఉంటారని స్వయంగా అనుభూతి పొందేలా పర్యాటక ప్రాజెక్టును రూపొందించాలని 2018లో ఐటీడీఏ పీవోగా పని చేసిన డీకే.బాలాజీ ఆలోచనకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంతో సుమారుగా రూ.కోటి వ్యయంతో అరకులోయకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గిరి గ్రామదర్శిని రూపుదిద్దుకుంది. గిరిజన గ్రామాన్ని పోలేలా గడ్డి పైకప్పుగా వేసి, మట్టితోనే గిరిజన గృహాలను నిర్మించారు. అక్కడికి వచ్చిన పర్యాటకులు గిరిజనుల వేషధారణతో, గిరిజనులు నిత్య జీవనంలో చేసే అన్ని పనులను చేయవచ్చు. అలాగే ఇందులో గిరిజన సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకోవడం ఓ ప్రత్యేకత. సందర్శకులు అక్కడ బస చేసేందుకు ప్రత్యేకమైన రిసార్టులు, భోజనాలు చేసేందుకు రెస్టారెంట్ సదుపాయాలున్నాయి.

» ఆదివాసీల పద్ధతిలో పెళ్లి చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత



గిరి గ్రామదర్శిని

గిరి సంప్రదాయంలో వివాహ వేడుక

వివాహం చేసుకుందామనుకునే(సందర్శకులు)వధూవరులను వేర్వేరు ఇళ్లలో ఉంచి, గిరిజనుల వలే వస్త్రధారణ చేయిస్తారు. పెళ్లి కుమార్తెకు అడ్డుకట్టు చీర కట్టి, సంప్రదాయ ఆభరణాలతో అలంకరిస్తారు. అలాగే పెళ్లి కుమారుడికి పంచె, తలపాగా కట్టి, కండువా వేస్తారు. వధూవరులకు పెళ్లి చేసే గురువు తొలుత దోష నివారణకు శంకు దేవుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత వారిద్దరిని వివాహ మండపం వద్దకు తీసుకువచ్చి పెళ్లి పీటలపై కూర్చోబెడతారు. అలాగే గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయిస్తారు. గిరిజన సంప్రదాయ పెళ్లి మంత్రాలు ఉచ్చరించి, వరుడితో వధువుకు తాళిబొట్టు కట్టిస్తారు. తలంబ్రాలు పోసుకోవడం, నీళ్ల బిందెలతో ఉంగరా లాట ఆడించడం వంటివి చేస్తారు. తరువాత వధూవరులు తమ ముఖాలకు పరస్పరం పసుపును రాసుకుంటారు. దీంతో వివాహ తంతు ముగుస్తుంది. నూతన వధూవరులను వివాహ మండపం చుట్టూ ఏడు మార్లు ప్రదక్షణ చేయించి, పెళ్లి కుమారుడికి కేటాయించిన ఇంటినే అత్తారింటిగా భావించి, నూతన వధువును అత్తారింటిలోకి ప్రవేశించే ప్రక్రియను చేస్తారు. వారి వివాహాన్ని పురస్కరించుకుని అందరూ కలిసి గిరిజన సంప్రదాయ థింసా నృత్యం ప్రదర్శిస్తారు. అలాగే నూతన వధూవరులతోపాటు పెళ్లికి హాజరైన అందరికీ స్థానిక వంటకాలతో విందు ఏర్పాటు చేస్తారు. గిరిజనులు పండించే దంపుడు బియ్యంతో అన్నం, కొండ కందులు, గుమ్మడికాయ ముక్కలతో పులుసు చేసి విందుకు హాజరైన వారికి భోజనాలు పెడతారు. పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లు, వీఐపీల తాకిడి, రూ.లక్షల వ్యయంతో జరిగే సాధారణ వివాహానికి భిన్నంగా విహార యాత్రలో ఆటవిడుపుగా గిరిజన సంప్రదాయంతో చేసే ఈ వివాహం చేసుకోడానికి అరకులోయకు వచ్చే సందర్శకులు అమితంగా ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ వివాహాలు చేసుకున్నవారిలో ఎందరో ప్రముఖులు ఉన్నారు. సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ దంపతులు, ఉన్నతాధికారులు గిరిజన సంప్రదాయంలో వివాహం చేసుకుని ఫొటోలు దిగి సరదాగా గడిపారు.


గిరి గ్రామదర్శినిలో గిరిజనుల వేషధారణలో పలువురు పర్యాటకులు



ఎలా వెళ్లాలంటే...

అరకులోయ పట్టణం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో పెదలబుడు వద్ద గిరి గ్రామదర్శిని ఉంది. అక్కడికి వెళ్లేందుకు చక్కని తారురోడ్డు సదుపాయం ఉంది. దీంతో సొంత వాహనాల్లోనూ చేరుకోవచ్చు. అలాగే అరకులోయ నుంచి అక్కడికి వెళ్లేందుకు ఆటోలు, ప్రైవేటు ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి.

ఉక్కిరిబిక్కిరి చేసే

న్యుమోనియా

చిన్నారుల్లో వైరల్, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్స్‌తో వ్యాప్తి

» కేజీహెచ్ ఓపీకి ప్రతిరోజూ 20 కేసులు

» ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలోనూ అదే పరిస్థితి

» స్మోకింగ్, ఆల్కహాల్ అలవాటున్న వారిలో అధికం

» నేడు ప్రపంచ న్యుమోనియా డే

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

న్యుమోనియా చిన్నారులతోపాటు పెద్దలను ఉక్కిరిబిక్కిరి చేసే ఆరోగ్య సమస్య. ఊపిరితిత్తుల్లో కఫం చేరడాన్ని న్యుమోనియాగా పిలుస్తారు. కొన్ని రకాల బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్స్ దీనికి కారణం. ఆల్కహాల్, స్మోకింగ్ అలవాటున్న వారి లో తీవ్రత అధికమని నిపుణులు చెబుతున్నారు. శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ప్రధాన సమస్య. గుర్తించడంలో ఆలస్యమైతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. నేడు ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా కథనం.

న్యుమోనియాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ప్రత్యేక థీమ్ రూపొందిస్తారు. ఈ ఏడాది ప్రతి శ్వాసకు లెక్క. గుర్తించడం ద్వారా నియంత్రించవచ్చు థీమ్‌తో నిర్వహిస్తున్నారు. చిన్నారుల్లో సమస్య తీవ్రత అధికమవుతుండడంతో అవగాహన కల్పించేందుకు వీలుగా 2009 నుంచి ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



ఇన్‌ఫెక్షన్స్‌తో ముప్పు

న్యుమోనియా అంటు వ్యాధి. దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాప్తి చెందుతుంది. బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్స్‌తో సమస్య అధికమవుతోంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం ఏటా 14 లక్షల మంది చిన్నారులు న్యుమోనియా బారినపడి మృతి చెందుతున్నారు. పెద్దల్లో వాయు కాలుష్యం, చల్లని గాలిలో తిరగడం, చల్లని తీళ్ల తాగడం, స్మోకింగ్, మద్యపానం న్యుమోనియాకు కారణమవుతున్నాయి.

నివారణ సాధ్యమే..

సకాలంలో గుర్తించి వైద్యం తీసుకుంటే మందులతోనే నయం చేయవచ్చు. దగ్గు, కఫం రెండు, మూడు రోజులకు మించి వేధిస్తుంటే తప్పనిసరిగా ఎక్స్‌రే, నాసల్ సైనస్ ఎక్స్‌రే తీసుకుని వైద్యులను సంప్రదించాలి. న్యుమోనియా అయితే యాంటీబయాటిక్స్ ద్వారా కోలుకు నేలా చేయవచ్చు. 80 శాతం కేసుల్లో ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణ సులభం. కొన్ని రకాల టీకాను తీసుకోవడం, ధూమపానానికి దూరంగా ఉండడం, వ్యాయామం ద్వారా న్యుమోనియా బారినపడ కుండా ఉండవచ్చు.

ప్రతిరోజూ 30 కేసులు



ఆస్పత్రిలో ఓపీకి రోజుకు 30 వరకు కేసులు వస్తుంటాయి. యువతలో సమస్య అధికంగా కనిపిస్తోంది. దాదాపు 40 ఏళ్లలోపు వారిలో 30 శాతం కేసులు నమోదవుతున్నాయి. షుగర్ వల్ల కొందరిలో సమస్య కనిపిస్తోంది. కఫం, దగ్గు మూడు, నాలుగు రోజులకు మించి ఉంటే వైద్యులను సంప్రదించాలి. ఈ సీజన్‌లో వైరస్, బాక్టీరియా యాక్టివ్ అవుతాయి. దీనివల్ల కేసులు నమోదవుతుంటాయి.

- డాక్టర్ రఘుమండ సునీల్ కుమార్,
సూపరింటెండెంట్, ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రి

పిల్లల్లో సమస్య అధికం



పుట్టిన చిన్నారి నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఎవరికైనా న్యుమోనియా రావచ్చు. దీనికి వైరస్‌లు, బాక్టీరియాలు కారణమవుతున్నాయి. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల్లో సమస్య తీవ్రత అధికం. లంగ్స్‌లో కఫం చేరి ఊపిరి తీసు కోవడం కష్టమవుతుంది. ఒక్కోసారి హార్ట్ ఫెయిల్యూర్ అవుతుంది. పిల్లలు పక్కలు ఎగరేయడం, శ్వాస అధికంగా తీసుకోవడం లాంటి లక్షణాలుంటే వైద్యులకు చూపించడం మేలు.

- డాక్టర్ బీఎస్ చక్రవర్తి,
పీడియాట్రిక్ విభాగాధిపతి, కేజీహెచ్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బోయిన

అనకాపల్లి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన బోయిన భానుమూర్తి యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం శ్రీశైలంలో జరిగిన సంఘ రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు చేతుల మీదుగా భానుమూర్తి యాదవ్ నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా భానుమూర్తియాదవ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న బోయిన

రేపటి నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సదస్సులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని పలాస, విశాఖపట్నం జోన్ -2, రంపచోడవరం, జంగారెడ్డిగూడెం డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు వేదిక చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలాస డివిజన్‌కు సంబంధించి ఈనెల 13న ఇచ్ఛాపురం సెక్షన్, విశాఖపట్నం జోన్-2కు సంబంధించి 19న మల్కాపురం సబ్ డివిజన్, రంపచోడవరం డివిజన్‌కు సంబంధించి ఈనెల 28న అడ్డతీగల సెక్షన్, జంగారెడ్డి గూడెం డివిజన్‌కు సంబంధించి ఈనెల 28న కొయ్యలగూడెం సబ్‌డివిజన్‌లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సదస్సులు జరుగుతాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, తదితర సమస్యలపై సమస్యలను తెలియజేయవచ్చునన్నారు. అలాగే సీతమ్మధారలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సీజీఆర్ఎఫ్ ఆఫీస్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదులు చేయవచ్చునని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారుల గోడును కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి ఆలకించారు.

ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమం ముగిసే సరికి 167 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే అర్జీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

అర్జీదారులతో చిరునవ్వుతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు అందజేయడంతో పాటు భరోసా ఇవ్వాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ముగిసే సమయానికి 40 అర్జీలు అందగా, అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటిపై అధికంగా అర్జీలు అందినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మోహనరావు, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు వరాలు

... 5వ పేజీ తరువాయి

పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది.

పోలవరం ఎడమ కాలువ పనులకు కదలిక

పోలవరం ప్రాజెక్టు పనులకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. జిల్లాలో ఎడమ ప్రధాన కాలువ నిర్మాణ పనుల్లో కదలిక ఏర్పడనున్నది. సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఎస్.రాయవరం మండలం ధార్లపూడి వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ అక్విడక్టును పరిశీలించారు. నిలిచిపోయిన కాలువ పనులను ఏడాదిలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తరువాత జలవనరుల శాఖ అధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

సుజల స్రవంతికి రూ.63 కోట్లు..

బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులకు బడ్జెట్‌లో రూ.63 కోట్లు కేటాయింపులు జరిగాయి. వాస్తవంగా 15 సంవత్సరాల క్రితం నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి సబ్బవరంలో పునాది వేశారు. 2014-19 మధ్య టీడీపీ అధికారంలో వున్నప్పుడు భూసేకరణతోపాటు మొదటి దశ పనులకు టెండర్లు ఖరారుచేసి పనులు మొదలు పెట్టారు. తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు జరిపి (అవి కూడా విడుదల చేయలేదు) కాలం వెళ్లదీసింది. తొలి ఏడాది 2019-20లో రూ.170.06 కోట్లు, 2020-21లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.79 కోట్లు, 2022-23 బడ్జెట్‌లో రూ.297.5 కోట్లు, కేటాయించినట్టు ప్రకటించిందే తప్ప నిధులు మాత్రం విడుదల చేయలేదు. భూసేకరణ కోసం 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. చివరకు రూ.7 కోట్లు మాత్రమే విడుదల చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం రానున్న ఐదు నెలల్లో (మార్చి 31లోపు) ఖర్చు చేయడానికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి రూ.63 కోట్లు కేటాయించింది.

విశాఖ-చెన్నై కారిడార్ పనులకు..

గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పారిశ్రామిక ప్రగతికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇక్కడ ప్రైవేటు రంగంలో ఏర్పాటు కానున్న మెగా స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

జిల్లాలో రెండు లక్షల మంది 'తల్లులకు వందనం'

తల్లికి వందనం పథకం అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా రూ.15 వేల చొప్పున చెల్లించనున్నది. జిల్లాలో సుమారు రెండు లక్షల మంది తల్లులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనున్నది.

పారిశ్రామిక వృద్ధికి తోడ్పాటు

- పీవీఎస్ఎన్ రాజు, జనసేన పార్టీ చోడవరం ఇన్‌చార్జి



కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయింపులు మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయి. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులు వేగం పుంజుకుంటాయి. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగులు పడేలా అడుగులు పడుతున్నాయి.

అరకొర కేటాయింపులు

- లోకనాథం, సీపీఎం జిల్లా కార్యదర్శి



బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తున్నప్పటికీ నిధులు కేటాయింపు అరకొరగానే వుంది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పలేదు. జిల్లాలో సాగునీటి వనరులకు అరకొరగా నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారు.

క్రైం... crime news

కనుజు మాంసంతో ఒకరి అరెస్టు

నర్సీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం పందూరు గ్రామంలో సోమవారం అటవీ అధికారులు కనుజు మాంసాన్ని స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. నర్సీపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మీనర్సు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పందూరు గ్రామానికి చెందిన బంగారి అప్పారావు ఉచ్చు వేసి కనుజుని వేటాడి చంపాడని, అతని వద్ద కనుజు మాంసం ఉన్నట్టు ముందస్తు సమాచారం వచ్చిందని తెలిపారు. వెంటనే సిబ్బందిని పందూరు పంపించి అప్పారావు వద్ద నుంచి తొమ్మిది కిలోల కనుజు మాంసం స్వాధీనం చేసుకొని, అతనిని అరెస్టు చేశామని తెలిపారు.

గ్లాసు కడిగి వస్తూ బాలిక సాంబారులో పడింది

» తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలింపు


గురుకుల పాఠశాల వంటగది

అచ్యుతాపురం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జారిపోవడం వల్లే రొంగలి యశస్విని సాంబారులో పడిపోయి తీవ్రంగా గాయపడిందని స్థానిక గురుకుల బాలికల విద్యాలయం ఇన్‌చార్జి ఎఫ్ఏసీ నాగమణి తెలిపారు. శనివారం సాయంత్రం 4.30 గంటలకు స్టడీ అవర్స్ తరువాత స్నాక్స్ సమయంలో లీడర్ అయిన యశస్విని పాఠశాలలో గల 469 విద్యార్థినులకు స్నాక్స్ ఇవ్వమని కిచెన్ సిబ్బందికి చెప్పింది. శనివారం గోధుమ రవ్వతో చేసిన ద్రవపదార్థాన్ని చేయడంతో అందరికీ గ్లాసులిచ్చారు. పిల్లలంతా గ్లాసులు కడగడానికి డైనింగ్ హాల్ వద్దకు వెళ్లారు. అక్కడ రద్దీగా ఉండడంతో కిచెన్‌లోకి వెళ్లింది. గ్లాసులు కడుగుకుని తిరిగి వచ్చేటప్పుడు కాలు జారి సాంబారు బేసిన్‌లో పడిపోయింది. సాంబారుబేసిన్ పెద్దది కావడంతో సాంబారును సగం తీసుకుని వెళ్లిన సిబ్బంది తిరిగి వచ్చేంతలో బేసిన్‌లో పాప పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే యశస్వినిని స్థానిక పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్సానంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అధికారులు విశాఖలో కేజీహెచ్‌కు తరలించడానికి సిద్ధపడ్డారు. పాప తల్లిదండ్రులు విశాఖలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తలో కొంత వేసుకుని చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అక్కరకురాని అగ్రి ల్యాబ్

... 5వ పేజీ తరువాయి

అప్‌లోడ్ చేసిన రూ.40 లక్షల బిల్లుకు నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. విద్యుత్, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు అసంపూర్తిగా వున్నాయి. ఆవరణలో తుప్పలు తొలగించలేదు. చుట్టూ ప్రహరీ గోడ నిర్మించలేదు. అప్పటి నుంచి ప్రభుత్వం బిల్లు చెల్లింపును పట్టించుకోలేదు. మిగిలిన పనులు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాలేదు.

అగ్రి ల్యాబ్‌తో రైతులకు ఎంతో మేలు

ఉమ్మడి జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. మట్టి నమూనాలు, ఎరువులు, విత్తనాల పరీక్షలకు రైతుల నుంచి ఎటువంటి డబ్బులు తీసుకోకుండా ఉచితంగా నిర్వహిస్తారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా పొలంలో ఏ పంట సాగుచేయాలి, ఏయే సూక్ష్మపోషకాలు (ఎరువులు) వేయాలి అన్నది తెలుస్తుంది. ప్రైవేటు దుకాణాల్లో రైతులు కొనుగోలు చేసే రసాయన ఎరువులు, విత్తనాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షిస్తారు. నిర్దేశించిన ప్రమాణాలు లేకపోతే సంబంధిత వ్యాపారులు, సంస్థలపైన చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చు. అగ్రి ల్యాబ్‌కు నాడు శ్రీకారం చుట్టిన టీడీపీ (కూటమి) ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చినందున పనులు పూర్తిచేయించి, అందుబాటులోకి తీసుకురావాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి అగ్రి ల్యాబ్

- బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి



సబ్బవరంలో అందుబాటులోకి రాని జిల్లాస్థాయి అగ్రి ల్యాబ్ గురించి ప్రభుత్వానికి తెలియపరిచాం. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.40 లక్షల మేర బిల్లు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. భవన నిర్మాణానికి సంబంధించి కొద్దిపాటి పనులు పెండింగ్‌లో వున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.